సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం, 14, ఏప్రిల్, 2025



సోమశిలలో 52.504 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం 52.504 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 480 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.97,140
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.8,770
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,033
సవర (8 గ్రాములు)	రూ.72,264

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.9 /29.5

సోమవారం జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ ఆదివారం 63 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

టీవీ మెకానిక్ కుమారుడికి అత్యధిక మార్కులు


తన్వీర్‌బాషా

పొదలకూరు: పొదలకూరు పట్టణానికి చెందిన టీవీ మెకానిక్ కొడుకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మంచి మార్కులు సాధించాడు. పట్టణంలోని బుడేసాహెబ్ వీధిలో నివసిస్తున్న యజ్దానీబాషా టీవీలను రిపేర్లు చేస్తుంటారు. ఈయనకు ఇద్దరు కుమారులు. వారిలో తన్వీర్ బాషా ఎంపీసీ గ్రూపులో 1000కు 992 మార్కులు సాధించాడు. తన్వీర్ బాషా నెల్లూరు నగరంలోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ చదివాడు. భవిష్యత్తులో ఇంజనీరింగ్ పూర్తి చేసి సివిల్స్‌లో విజేతగా నిలిచి పేదల అభ్యున్నతికి పాటుపడతానని తెలిపాడు.

పెండింగ్ బకాయిల కోసం పోరుబాట


మాట్లాడుతున్న మన్నేపల్లి పెంచలరావు

నెల్లూరు(అర్బన్): అన్ని ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను జేఏసీ ఆధ్వర్యంలో సాధించుకునేందుకు పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎన్‌జీఓ అసోసియేషన్ భవన్‌నందు ఆ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సెక్రటేరియట్ సమావేశం జరిగింది. సభకు అధ్యక్షత వహించిన చంద్రశేఖర్ మాట్లాడుతూ పని భారాన్ని తగ్గించేందుకు ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తమ సంఘం నాయకులు, ఉద్యోగులు జేఏసీ నాయకులతో కలిసి సమన్వయం చేసుకుంటూ డిమాండ్ల సాధన కోసం ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ మన్నేపల్లి పెంచలరావు మాట్లాడారు. జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడు నందిమండలం ఆంజనేయవర్మ, నగర అధ్యక్షుడు చిలకా రామకృష్ణారెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు సందీప్ చక్రవర్తి, సాగర్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వీఎస్ సాయిరాం, ప్రధాన కార్యదర్శి సుబ్బనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్టుకు 3వ స్థానం


బహుమతి అందుకుంటున్న జిల్లా జట్టు

నెల్లూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలలో నెల్లూరు జిల్లా జట్టు ప్రతిభ కనబరిచి 3వ స్థానం సాధించింది. దీంతో జట్టుకు కప్పు, రూ.5వేలు నగదు బహుమతిని అందజేశారు. ఈ పోటీలలో మొత్తం 13 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. అనంతపురం జిల్లా మొదటిస్థానం, పశ్చిమ గోదావరి జిల్లా రెండవ స్థానం గెలుచుకున్నాయి. విజేతలకు అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు చేతుల మీదుగా ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు.

నేటి పీజీఆర్ఎస్ రద్దు

నెల్లూరు(క్రైమ్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను రద్దు చేసినట్లు జిల్లా పోలీసు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని సూచించింది.

ఈదురు గాలులతో వర్షం

దుత్తలూరు: దుత్తలూరు మండలంలోని పలు ప్రాంతాలలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు వీచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఏలూరు, కావలి, ఆత్మకూరు డివిజన్‌లలోని కొన్ని ప్రాంతాలలో కూడా వర్షం కురిసింది. గత వారం రోజులుగా ఎండల తీవ్రతతో అల్లాడిన ప్రజలకు ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి వర్షం కురవడంతో కాస్త ఉపశమనం కలిగింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బుచ్చిరెడ్డిపాళెం, నెల్లూరులో పలు చోట్ల గాలులకు హోర్డింగులు ఊడిపడ్డాయి.

నయనానందకరంగా శోభాయాత్ర


శోభాయాత్రలో వాహనంపై హనుమంతుడు

యాత్రలో భారీగా పాల్గొన్న నగరవాసులు




శోభాయాత్రలో వాహనంపై శ్రీరాముడు


- కాషాయపతాక రెపరెపలు
- జై శ్రీరాం, జై హనుమాన్ నినాదాలతో హోరెత్తిన సింహపురి

నెల్లూరు(బృందావనం): జై శ్రీరాం... జై హనుమాన్... జై భజరంగబలి నామస్మరణలతో నెల్లూరు నగరం మార్మోగింది. హనుమాన్, సీతారామ, లక్ష్మణ, హనుమాన్ కాషాయవర్ణ పతాకాల రెపరెపలతో సింహపురి శోభిల్లింది. హనుమ విజయోత్సవాన్ని పురస్కరించుకొని అశేష హిందూ భక్తులతో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం నిర్వహించిన హనుమాన్ భక్త శోభాయాత్ర ఘనంగా సాగింది. ఆద్యంతం యువత కేరింతలతో, ఆధ్యాత్మిక చింతనతో నగరం హోరెత్తింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి, నగర పరిసరాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది హనుమాన్ భక్తులతో ప్రదర్శన వేడుకగా సాగింది. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి సాయంత్రం ర్యాలీ ప్రారంభమైంది. ఈ మోటార్‌బైక్ ర్యాలీ కేవీఆర్ పెట్రోలుబంక్, జిల్లాకోర్టు, గాంధీబొమ్మ, ఏసీసెంటర్, కనకమహల్, సుబేదారుపేట, స్టోన్‌హౌస్‌పేట మీదుగా తడికలబజార్ సెంటర్ నుంచి ఆర్ఎస్ఆర్ఎం ఉన్నత పాఠశాల మైదానానికి చేరింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హిందూచైతన్య వేదిక నాయకులు మాట్లాడుతూ హనుమంతుడు లంకకు వెళ్లి సీతమ్మ జాడను కనుగొని వాలమునకు అంటించిన నిప్పుతో లంకాదహనం చేసి సముద్రంలో దూకి మరలా పునరుజ్జీవం పొందిన రోజును హనుమ విజయోత్సవంగా జరుపుకొంటున్నట్లు తెలిపారు. హనుమంతుని వ్యక్తిత్వం, ధీరత్వం, సమయస్ఫూర్తి, కార్యదక్షతను యువతలో పెంపొందించాలన్న ఉద్దేశంతో ప్రతి ఏడాది హనుమభక్త శోభాయాత్ర, బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీ ముగింపు సందర్భంగా ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక రాష్ట్ర సహ అధ్యక్షుడు కోదూరు జయరామ్, రాష్ట్ర న్యాయవాద విభాగం అధ్యక్షుడు నేలపాటి నాగశ్రీనివాస్, రాష్ట్ర సమన్వయకర్త పీజీ మహేష్, రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు కాకు మురళిరెడ్డి, జిల్లా నాయకులు టి.సాయిశ్రీనివాస్, అచ్చి రామాంజనేయులు, సొల్లేటి వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


టెంకాయ కొట్టి శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

దోపిడీకి పచ్చబాట

సిమెంట్ రోడ్ల నిర్మాణ పనుల్లో అక్రమాలు




ఉదయగిరి మండలం తిరుమలాపురంలో సీసీ రోడ్డుకు వాడిన ఇసుక ఇదే

- నాణ్యతకు తిలోదకాలు
- టీడీపీ నేతల జేబుల్లోకి ప్రజాధనం
- అధికారుల అండదండలు



రోడ్డుపై రోడ్డేశారు

ఈ చిత్రంలో కనిపిస్తున్న సీసీరోడ్డు దుత్తలూరు మండలం నందిపాడు బీసీ కాలనీలోనిది. గత ప్రభుత్వ హయాంలో రూ.5 లక్షల అంచనా వ్యయంతో 125 మీటర్ల మేర రోడ్డును నిర్మించారు. ఇటీవల దానిపైనే టీడీపీ నాయకులు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో మళ్లీ రోడ్డు వేశారు. గతంలో రోడ్డు వేసి కనీసం నాలుగేళ్లు కూడా పూర్తి కాలేదు. రోడ్డు ఎక్కడా కూడా దెబ్బతినలేదు. అదే రోడ్డుపై రూ.5 లక్షల వ్యయం చేసి మళ్లీ తూతూ మంత్రంగా రోడ్డు వేసి నిధులు కాజేశారు.

నాణ్యతలేక నిలువునా చీలింది



ఈ చిత్రంలో కనిపిస్తున్న సీసీరోడ్డును జలదంకి మండలం కొత్తపాళెం గ్రామంలో రైసుమిల్లు నుంచి బోడగుడిపాడు వరకు రూ.10 లక్షల అంచనా వ్యయంతో 260 మీటర్ల మేర నిర్మించారు. ఫిబ్రవరిలో రోడ్డును నిర్మించగా రెండు నెలలు కూడా పూర్తికాక ముందే నాణ్యత లోపంతో సుమారు 30 మీటర్ల మేర మధ్యలో నిట్టనిలువుగా పగిలిపోయింది.

అవసరంలేని చోట నాసిరకంగా..



ఈ చిత్రంలో కనిపిస్తున్న రోడ్డును దుత్తలూరు మండలం నర్రవాడ పొలాల్లోకి వెళ్లే మార్గంలో నిర్మించారు. ఉపాధి నిధులు సుమారు రూ.5 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టారు. నిబంధనల ప్రకారం జనావాసాలు ఉన్న చోట రోడ్డు వేయాలి. కానీ అందుకు భిన్నంగా పొలాల్లోకి వెళ్లే మార్గంలో గ్రామదేవత గుడి వరకు తూతూ మంత్రంగా రోడ్డును నిర్మించారు. ఏదైనా గ్రామంలో సీసీరోడ్లు వేసేందుకు అవకాశం లేకపోతే ప్రజలకు ఉపయోగపడే వేరే పనులు చేపట్టే అవకాశం ఉంది. కానీ ఊరు బయట ఎలా రోడ్డు వేసినా అడిగేవారు ఉండరనే ఉద్దేశంతో నాసిరకంగా నిర్మించి నిధులు స్వాహా చేశారు.

ఉదయగిరి: ప్రజా సంక్షేమాన్ని విస్మరించి.. ఎన్నికల హామీలను తుంగలో తొక్కి.. సొంత పార్టీ నేతల కడుపు నింపేందుకు కూటమి ప్రభుత్వం పచ్చబాటేసింది. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను తమ్ముళ్లకు పంచడమే లక్ష్యంగా పల్లెల్లో సీసీరోడ్లు వేసేందుకు కోట్లాది రూపాయల నిధులు కట్టబెట్టింది. ఇదే అదనుగా వారు అధికారుల అండతో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చి పనులను తూతూమంత్రంగా చేపడుతూ నిధులను స్వాహా చేస్తున్నారు.

దోపిడీ ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్ల నిర్మాణం పేరుతో ఉపాధి నిధులు కొల్లగొట్టేందుకు టీడీపీ నేతలు వ్యూహం రచించారు. పల్లె పండగ పేరుతో గతేడాది అగస్టులో ఒకేసారి గ్రామసభలు నిర్వహించి తెలుగు తమ్ముళ్లకు పనులు కట్టబెట్టారు. అక్టోబరులో పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం నాణ్యతకు నీళ్లొదిలి నామమాత్రంగా పనులు చేపట్టి లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని దోచేశారు.

నాణ్యత ప్రశ్నార్థకం

జిల్లాలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద సామగ్రి పనులకు రూ.160 కోట్లు మంజూరయ్యాయి. అందులో భాగంగా ఉదయగిరి నియోజకవర్గానికి 435 పనులకు గాను రూ.26.57 కోట్లు కేటాయించారు. ఇప్పటి వరకు 422 పనులను పూర్తిచేసి రూ.25.81 కోట్ల చెల్లింపులు చేశారు. నియోజకవర్గంలో జరిగిన సీసీరోడ్డు పనుల్లో నాణ్యత పూర్తిగా లోపించింది. పెన్నానది ఇసుకను ఉపయోగించి నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా స్థానికంగా వాగులు, వంకల్లోని మట్టితో కూడిన ఇసుకను వాడారు. సిమెంట్‌ను ప్రమాణాల మేరకు ఉపయోగించలేదు. క్యూరింగ్‌ను సైతం సక్రమంగా చేపట్టలేదు. పనులపైన ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేదు. దీంతో నాణ్యత లోపంతో ముణ్నాళ్లకే రోడ్లపై పగుళ్లు రావడం కనిపించింది.

ఇష్టారాజ్యంగా పనులు

సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి, వింజమూరు మండలాలకు సంబంధించి వింజమూరు పంచాయతీరాజ్ ఏఈ తిరుమలయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మండలాల్లో జరిగిన సీసీరోడ్ల పనుల్లో భారీగా అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ మండలాల్లో పనులు ఒకచోట మంజూరు చేయగా మరోచోట పనులు చేపట్టారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ లేఅవుట్లు, జనావాసాలు లేని ప్రాంతాల్లో రోడ్లు వేయడం, గతంలో వేసిన సీసీరోడ్ల పైనే మళ్లీ వేయడం వంటి ఎన్నో చిత్రవిచిత్రాలు చోటు చేసుకున్నాయి. ఏఈ పర్యవేక్షణ లేకుండా పనులు జరిగినా, ఎంబుక్ చేసేటప్పుడు నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలి. ఆ సమయంలో అక్రమాలు బయటపడతాయి. సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపించినా ఎంబుక్ చేసి నిధులు స్వాహా చేయడం వెనుక ఇంజనీరింగ్ అధికారుల పాత్ర ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్వాలిటీ కంట్రోల్ అధికారులు నమూనాలు తీసి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వక ముందే బిల్లులు పెట్టారనే ఆరోపణలు కూడా ఏఈ తిరుమలయ్యపై ఉన్నాయి. ఈ పనులను స్వయంగా చూసి చెక్ మెజర్ చేయాల్సిన డీఈ గుడ్డిగా బిల్లులు ఎలా పాస్ చేశారనేది ప్రశ్నార్థకంగా మారింది. జలదంకి, కొండాపురం మండలాల పంచాయతీరాజ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వాణి పేరుకే ఇంజనీర్ అయినప్పటికి, ఆమె భర్త అన్నీ తానై వ్యవహరిస్తారనే ఆరోపణలు ఉన్నాయి.

విజిలెన్స్ విచారణతో వాస్తవాలు

ఉదయగిరి నియోజకవర్గంలో సీసీరోడ్ల పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలు పూర్తిగా వెలుగులోకి రావాలంటే విజిలెన్స్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలి. అప్పుడే రోడ్ల నిర్మాణంలో డొల్లతనం బయటపడుతుంది. కోట్లాది రూపాయల ఉపాధి నిధులతో చేపట్టే పనుల్లోని అక్రమాలను కొంతమేర అరికట్టవచ్చు.

విచారణ చేపట్టి చర్యలు

నియోజకవర్గంలో జరిగిన సీసీ రోడ్ల పనులకు సంబంధిచి అవినీతి అక్రమాలు జరిగి ఉంటే విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. ఉదయగిరిలో ఏఈలు కొరత ఉన్నందున ఎక్కువ మండలాలకు ఒకే ఏఈకి అదనపు బాధ్యతలు ఇవ్వాల్సి వచ్చింది. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోయినా, నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగినా తగిన చర్యలు తీసుకుంటాం.

– పంచాయతీరాజ్ ఎస్‌ఈ


ఎండవేడికి తాళలేక తలపై చీరకొంగు వేసుకుని వెళుతున్న మహిళలు

సుర్రుమంటున్న సూరీడు

- మే నెల రాకముందే తీవ్ర ఎండలు
- వేడిగాలులు, ఉక్కపోత
- బయటకు రావాలంటే జంకుతున్న జనం

నెల్లూరు(అర్బన్): వేడిగాలులతో జిల్లా ఉడికిపోతోంది. భానుడి భగభగలకు ప్రజలు అల్లాడుతున్నారు. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కూడా హీట్‌వేవ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఆ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ ప్రకటనలో తెలియజేశారు. లేదంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. శనివారం జిల్లాలో 41 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇంత వేడి సాధారణంగా మే నెలలో నమోదవుతుంటుంది. అయితే ఈ సంవత్సరం ఏప్రిల్‌లోనే 41 డిగ్రీలకు ఎండలు చేరడంతో మే నెల వస్తే ఇంకెంత సెగ తగులుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. మండే ఎండలకు ప్రజలు బయటకు రావాలంటే హడలిపోతున్నారు. ఉదయం 11 గంటలకే రోడ్లపై జనసంచారం తగ్గిపోతోంది. వైద్య శాఖాధికారులు, జిల్లా అధికారులు కూడా ఉదయం ప్రజలు తమ పనులు చూసుకుని 11 గంటలలోపు ఇళ్లకు చేరాలని సూచిస్తున్నారు. సాయంకాలం 4 గంటల తర్వాతనే బయటకు రావాలని పేర్కొంటున్నారు. తప్పనిసరి పరిస్థితి అయితే ప్రజలు గొడుగులు వేసుకుని బయటకు రావాలని పేర్కొంటున్నారు. చిన్న పిల్లలు, వృద్ధుల పట్ల మరిన్ని జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువగా మంచినీరు, నిమ్మరసం, పండ్లరసాలు, పలుచటి మజ్జిగ తాగాలని సూచిస్తున్నారు. శీతల పానీయాల జోలికి వెళ్లవద్దంటున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

తేదీ	ఉష్ణోగ్రత
7	38.0
8	36.6
9	36.1
10	38.4
11	37.8
12	41.0
13	38.9

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం


చెంచునాయుడు (ఫైల్)

కలిగిరి: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన కావలి ముస్తాపురంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. జామాయిల్ పొలంలో వ్యవసాయ పనులను రైతు నంబూరి చెంచునాయుడు (60) చేయసాగారు. ఈ క్రమంలో ఆయన చేతిలోని చలగపార విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. చెంచునాయుడు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



సంగం: సంగంలో అపస్మారక స్థితికి చేరుకున్న గుర్తుతెలియని వ్యక్తి ఆత్మకూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాల సందర్భంగా ప్రాంగణంలో గుర్తుతెలియని వ్యక్తి శనివారం నిద్రించారు. ఆదివారం ఉదయం 10 గంటలకూ నిద్ర లేవకపోవడాన్ని స్థానికులు గమనించారు. అపస్మారక స్థితిలో ఉండటంతో 108లో ఆత్మకూరులోని వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి 45 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు.

స్కూటీని ఢీకొన్న కారు

- వ్యక్తి మృతి

జలదంకి: స్కూటీని కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని జమ్మలపాళెం ఎస్వీఆర్ కల్యాణ మండప సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. జలదంకి పోలీసుల వివరాల మేరకు.. జమ్మలపాళేనికి చెందిన తన్నీరు మాల్యాద్రి (50) కావలి నుంచి తన గ్రామానికి స్కూటీపై బయల్దేరారు. ఈ సమయంలో కావలికి చెందిన దాసరి మాధవరావు జమ్మలపాళెం వైపు కారులో వస్తూ స్కూటీని వెనుక వైపు నుంచి ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన మాల్యాద్రిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. ఎస్సై లతీఫున్నీసా కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అంబేడ్కర్ జయంత్యుత్సవం నేడు

నెల్లూరు రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని నగరంలో సోమవారం నిర్వహించనున్నామని కలెక్టర్ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాలంకారం, తదుపరి మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ సాంఘిక బాలికల వసతిగృహంలో జయంతి వేడుకలను నిర్వహించనున్నామని వివరించారు. కార్యక్రమాలకు తరలిరావాలని కోరారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 46.81 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సత్య సాయి గంగ కాలువకు 1380, పిన్నేరుకు ఐదు, లోలెవల్‌కు 50, హైలెవల్‌కు 30, మొదటి బ్రాంచ్ కాలువకు పది క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

పౌల్ట్రీ ధరలు




బ్రాయిలర్:	రూ.117
లేయర్	రూ.100
బ్రాయిలర్ చికెన్:	రూ.210
స్కిన్‌లెస్ చికెన్:	రూ.232
లేయర్ చికెన్:	రూ.170

- రేపట్నుంచి 61 రోజుల పాటు అమల్లో
- మత్స్యకార భృతిపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆపన్నహస్తం

చేపల వేటకు విరామం


చిప్పలేరులో నిలిచిపోయిన బోట్లు



కావలి: సముద్రంలో చేపల వేటకు 61 రోజుల విరామాన్ని పాటించనున్నారు. మంగళవారం నుంచి జూన్ 14 వరకు వేట నిషేధిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిబంధన మేరకు సముద్ర జలాల్లో మెకనైజ్డ్, మోటార్ బోట్ల ద్వారా వేటను సాగించరాదు. వీటిని ఉల్లంఘిస్తే బోట్ల యజమానులు ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం – 1994, సెక్షన్ (4) మేరకు శిక్షార్హులు కానున్నారు. వారి బోట్లు, అందులో ఉన్న మత్స్య సంపదను స్వాధీనం చేసుకొని జరిమానా విధించనున్నారు.

ఒడ్డుకు చేరిన బోట్లు

వాస్తవానికి ఏడాదిగా సముద్రంలో చేపలు పడక మత్స్యకారులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు చేపల వేటపై నిషేధంతో జిల్లాలోని ఉలవపాడు, గుడ్లూరు, కావలి రూరల్, బోగోలు, అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల్లోని తీర గ్రామాల్లో ఉన్న బోట్లు ఒడ్డుకు చేరాయి. దీంతో తీర ప్రాంతాలు ప్రస్తుతం బోసిపోయాయి.

నిషేధం ఎందుకంటే..?

తొలుత నెల రోజులే ఉండే ఈ నిషేధాన్ని క్రమంగా పెంచారు. ఏపీ మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ యాక్ట్ – 1995 మేరకు సముద్రంలో చేపల వేటకు సంబంధించి పలు ఆదేశాలున్నాయి. ఈ చట్టం 1997 నుంచి ఆచరణలోకి రాగా, 2007 నుంచి అమలవుతోంది. వేసవిలో గుడ్లు పెట్టే దశలో వేట కారణంగా పునరుత్పత్తి పడిపోతుంది. దీంతో అరుదైన మత్స్య జాతులు కనుమరుగవుతున్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు చేపల వేటపై నిషేధాన్ని విధించడం ద్వారా, సముద్రజీవులు గుడ్లు పెట్టే సమయంలో ఎలాంటి ఆటంకం ఉండదు. తొలుత రాష్ట్రంలో మొదలైన దీన్ని తీర ప్రాంతంలోని అన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు.

మత్స్యకార భరోసాతో ఖుషీఖుషీ

2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక వీరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేయాలని సంకల్పించారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ఎగ్గొట్టిన బకాయిల చెల్లింపుతో వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకాన్ని ప్రారంభించారు. ఆ సంవత్సరం మొదలుకొని 2023 వరకు దీన్ని దిగ్విజయంగా అమలు చేసి, మత్స్యకారుల బ్యాంక్ ఖాతాల్లో ఈ మొత్తాన్ని జమ చేశారు.

హామీ.. గాలి మూటేనా

గత ఎన్నికలకు ముందు హామీల వర్షాన్ని టీడీపీ కురిపించింది. మత్స్యకారులకు రూ.20 వేలను ఇస్తామని ప్రకటించింది. ఈ లెక్కన 12,444 మందికి రూ.20 వేల చొప్పున రూ.24.89 కోట్లను ఇవ్వాల్సి ఉంది. అయితే దీనిపై నేటికీ స్పష్టత లేదు. సాధారణంగా మత్స్యకార మహిళలు సముద్రం నుంచి వచ్చిన చేపలను మార్కెట్ చేసుకుంటూ పొట్ట నింపుకొంటారు. రెండు నెలల పాటు వేట లేకపోవడంతో వీరి ఉపాధికి గండిపడనుంది. హామీ మేరకు భృతిని మంజూరు చేసి ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

భృతి మాటేమిటీ..!

వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు పరిహారాన్ని ప్రస్తుత ప్రభుత్వం సక్రమంగా అందించడంలేదు. 2014 – 19 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం తూతూమంత్రపు చర్యలు చేపట్టింది. ఆ సమయంలో తొలి రెండేళ్లు రూ.రెండు వేల చొప్పున, మూడు, నాలుగో సంవత్సరాల్లో రూ.నాలుగు వేలను ఇచ్చి చివర్లో విస్మరించింది.

దీన స్థితిని పట్టించుకోవాలి

చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారుల దీన స్థితిని ప్రభుత్వం పట్టించుకోవాలి. వేట విరామం జీవనోపాధికి పెద్ద సమస్యగా మారుతుంది. మేలో చేపలు బాగా పడతాయి. వర్షాలు ప్రారంభమయ్యాక పెద్దగా దొరకవు. వేట లేకపోవడం, మరో పనిరాకపోవడంతో రెండు నెలల పాటు ఖాళీగా గడపాల్సి ఉంటుంది.

– తిరుపతి, మత్స్యకారుడు, ఇస్కపల్లి, అల్లూరు మండలం

కుటుంబపోషణకు అవస్థ పడాలి

వేట జరిగితే ఎంతో కొంత దొరికిన చేపలను అమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటాం. ఆ సమయంలో మాకు చేతినిండా పని ఉంటుంది. వేటకు విరామ సమయంలో మా కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కుటుంబ పోషణకు అవస్థలు తప్పవు.

– రత్నమ్మ, మత్స్యకార మహిళ, తుమ్మలపెంట, కావలి రూరల్ మండలం

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ప్రేమ విషయంలో మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. మనుమసిద్ధినగర్‌లో నివాసం ఉంటున్న రమణమ్మ, చిన్నయ్య దంపతులకు నలుగురు కుమారులు, కుమార్తె సంతానం. బంగారు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిన్నకుమారుడు పోలయ్య (25) అదే ప్రాంతానికి చెందిన ఓ యువతి ప్రేమించుకున్నారు. ఈ విషయమై గొడవలు జరుగుతున్నాయి. దీంతో పోలయ్య మూడు రోజులుగా ఎవరితో మాట్లాడలేదు. ఈ తరుణంలో రమణమ్మ తన మరో కుమారుడు నరేష్‌తో కలిసి సమీపంలోని అమ్మ ఇంటికి శనివారం వెళ్లారు. ఇంట్లోనే ఉన్న పోలయ్య బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంటికి సాయంత్రమొచ్చి తలుపులను రమణమ్మ, నరేష్ తట్టగా, లోపల నుంచి ఎలాంటి అలికిడి లేకపోవడంతో స్థానికుల సాయంతో పగలగొట్టారు. ఉరేసుకొని ఉన్న పోలయ్యను కిందికి దించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. దీనిపై చిన్నబజార్ పోలీసులకు తల్లి రమణమ్మ ఆదివారం ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి..

నెల్లూరు(క్రైమ్): షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సౌత్ రైల్వేస్టేషన్ సమీపంలో నెల్లూరు వైపు వచ్చే పట్టాలపై ఆదివారం చోటుచేసుకుంది. మృతుడు తెలుపు రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నలుపురంగుపై పసుపు డిజైన్ లుంగీని ధరించి ఉన్నారు. మోచేతి వరకు ఎడమ చేయి లేదు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వం.. రథోత్సవం


వేడుకగా సాగుతున్న రథోత్సవం (ఇన్‌సెట్లో) ప్రత్యేకాలంకారంలో స్వామి, అమ్మవార్లు

నెల్లూరు(బృందావనం) : బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అనంత కోదండరామస్వామి రథోత్సవం ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. నయనానందకరంగా తీర్చిదిద్దిన రథంపై సీతా లక్ష్మణ హనుమంత సమేత అనంత కోదండరామస్వామివారు సర్వాలంకారశోభితంగా కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. ప్రధానార్చకుడు బృందావనం శ్రీనివాసదీక్షితులు ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు మూలవర్లు, ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు, తిరుమంజనాన్ని జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని కొబ్బరికాయలు, గుమ్మడికాయలు కొట్టి ఉప్పు, మిరియాలను రథచక్రాలపై జల్లుతూ మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. రథోత్సవం గౌడ హాస్టల్ సెంటర్, ఉగాది సెంటర్, ఏసీనగర్ మెయిన్‌రోడ్డు, బాలాజీనగర్ మెయిన్‌రోడ్డు మీదుగా మందిరానికి చేరింది. ఉభయకర్తలుగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి– సంధ్య దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ నిర్వాహకులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కొప్పరపు శివప్రసాద్, మట్టా ప్రసన్నాంజనేయులు, అమరా మోహన్‌రావు, వీఎస్.ప్రసాద్‌రావు, స్వామి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


కోలాటమాడుతున్న చిన్నారులు, మహిళలు

కావలి డీఎస్పీ వైఖరి సిగ్గుచేటు

- రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోయారు
- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: స్థానిక ఎమ్మెల్యే కృష్ణారెడ్డి వద్ద మీడియా ముసుగులో ఉన్న బ్రోకర్‌కు కావలి డీఎస్పీ శ్రీధర్ భయపడటం పోలీస్ వ్యవస్థకే సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, ఎమ్మెల్యే అరాచకాలపై వార్తలు రాసేవారిపై పోలీసుల ద్వారా అక్రమంగా కేసులు నమోదు చేయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే వద్ద ఉన్న ఓ మీడియా బ్రోకర్ పోలీస్ శాఖనే శాసిస్తూ ఆదేశాలివ్వడం దారుణమన్నారు. సదరు వ్యక్తి తనపై అసభ్యపదజాలంతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుండటంతో కావలి డీఎస్పీని కలిశానని, అయితే తనపై ఒత్తిళ్లు ఉన్నాయని, ఏమీ చేయలేనని, ఏదో ఒక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసుకోమని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి వైఖరితో ఉన్న డీఎస్పీని ఎప్పుడూ చూడలేదని చెప్పారు. కావలిలో మనీ స్కీమ్ పేరుతో రూ.100 కోట్లకుపైగా దోచేశారని, ఇందులో కొందరు పోలీసుల పాత్ర ఉందన్నారు. ఇప్పటి వరకు కేసు విచారణ ఏమైందో.. రికవరీ చేసిన కోట్లాది రూపాయలు ఎక్కడికెళ్లాయో పోలీసులు వెల్లడించలేదని ఆరోపించారు. ఇలాంటి వాటిపై దృష్టి పెట్టకుండా పత్రిక స్వేచ్ఛను హరించేలా దిగజారి ప్రవర్తిస్తుండటం బాధాకరమన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కొత్తగా నిధులు తీసుకొచ్చి.. చేసిందేమీ లేదని, తన హయాంలో మంజూరైన పనులనే చేస్తూ, వాటిని తాను చేస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రుద్రకోటలో భారీ ఎత్తున గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తుంటే గ్రామస్తులు ప్రశ్నించగా, మీ సంగతి చూస్తామని బెదిరించారని, ఈ విషయంలో ఓ విలేకరిని సైతం కట్టేసి కొట్టారని ఆరోపించారు. కావలిలో జరుగుతున్న దురాగాతాలపై కలెక్టర్, ఎస్పీ దృష్టి సారించాలని కోరారు.

చందనాలంకారం నేడు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తి చందనాలంకారంలో సోమవారం దర్శనమివ్వనున్నారని దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామివారి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకొని శాంతిహోమం, కల్యాణం, బంగారు గరుడసేవను నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

నిమ్మ ధరలు పొదలకూరు



పెద్దవి:	రూ.85
సన్నవి:	రూ.60
పండ్లు:	రూ.40

పెన్నాను కుళ్లబొడుస్తూ..

కలువాయి మండలంలోని రాజుపాళెం, తెలుగురాయపురంలో ఇసుక తోడేళ్లు.. పెన్నానదిని చెరపట్టి తోడేస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే అండదండలతో అక్రమార్కులు రాత్రీ పగలనే తేడా లేకుండా పర్యావరణానికి తూట్లు పొడుస్తూ యంత్రాలతో తీరాన్ని కుళ్లబొడుస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో రహదారులు ఛిద్రమవుతున్నాయి. పరిసర గ్రామాల ప్రజలకు ఈ రహదారుల్లో ప్రయాణం నరకాన్ని చూపిస్తోంది.

- విధ్వంసం సృష్టిస్తున్న ఇసుక తోడేళ్లు
- మైన్లను తలపిస్తున్న నదీ తీరం
- నూకనపల్లి వద్ద వాహనాల తాకిడితో కూలిన బ్రిడ్జి
- ఎమ్మెల్యే అండతో రెచ్చిపోతున్న మాఫియా
- రాజుపాళెం, తెలుగురాయపురంలో తమ్ముళ్ల బరితెగింపు


స్కూల్ బస్సు నిలిచిపోవడంతో నడిచివెళ్తున్న విద్యార్థులు


నూకనపల్లి వద్ద వంతెన కూలడంతో ఇరుక్కుపోయిన టిప్పర్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఇసుకను భారీ యంత్రాలతో తోడేస్తుండటంతో పెన్నానది ఓపెన్ కాస్ట్ మైన్లను తలపిస్తోంది. ఎక్కడికక్కడ సుమారు 20 అడుగుల మేర లోతులో తవ్వేస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు సోమశిల జలాశయానికి ప్రమాదకర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని పర్యావరణ, జల సంరక్షకులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలుగురాయపురం, రాజుపాళెం రీచ్‌ల నుంచి నిత్యం 200కుపైగా వాహనాల్లో ఇసుక అక్రమ రవాణా అవుతోందని తెలుస్తోంది. దీన్ని తమిళనాడు, బెంగళూరుతో పాటు ప్రకాశం జిల్లాకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

దుర్భరంగా రహదారులు

తెలుగురాయపురం అనధికార రీచ్ నుంచి భారీ వాహనాలతో ఇసుకను అక్రమార్కులు తరలిస్తుండటంతో ఆ ప్రాంత రహదారులు ఛిద్రమవుతున్నాయి. ఒక్కో టిప్పర్ సామర్థ్యం 40 టన్నులైతే.. దాదాపు 60 టన్నుల మేర తరలిస్తున్నారు. ఈ ప్రాంతంలోని రహదారులన్నీ సింగిల్ రోడ్లు కావడంతో భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతింటున్నాయి.

కూలిన వంతెన

తాజాగా తెలుగురాయపురం నుంచి కలువాయి మీదుగా లోడ్‌తో వెళ్లే వాహన ధాటికి నూకనపల్లి వద్ద వంతెన కూలిపోయింది. మొత్తం 57 టన్నుల బరువు గల వాహనం కావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఫలితంగా తెలుగురాయపురం, నూకనపల్లి, కొలవపల్లి, ఇస్కపల్లి గ్రామాల మధ్య సుమారు ఆరు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ పరిణామంతో ప్రైవేట్ స్కూల్‌కు విద్యార్థులు శనివారం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వాహనం నిలిచిపోవడంతో ఎండలోనే కిలోమీటర్ల మేర నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లారు. స్థానికులే వంతెనకు ఇసుక వేసి తాత్కాలికంగా రాకపోకలకు మార్గం చేసుకున్నారు.

అధికారుల పరిశీలన

నూకనపల్లి వద్ద బ్రిడ్జి కూలిపోవడంతో సంబంధిత ఆర్ అండ్ బీ ఈఈ మురళి, జేఈ జ్ఞానేశ్‌తో పాటు మైనింగ్ ఆర్ఐ స్వాతి, ఎస్సై సుమన్ పరిశీలించారు. భారీ వాహనాల రాకపోకలతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపించారు. అధికార పార్టీ నేతల ప్రమేయంతో ఇసుకాసురులు బరితెగించి అక్రమ రవాణా చేస్తున్నా, పట్టించుకోవడంలేదంటూ ఆగ్రహంతో రగలిపోయారు. అప్పటికే అధికారులపై రాజకీయ ఒత్తిడి రావడంతో అక్కడి నుంచి జారుకున్నారు. వంతెన కూలిన విషయమై ఆర్ అండ్ బీ ఈఈ మాట్లాడుతూ.. నూతన రహదారి విస్తరణకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే ప్రారంభించనున్నామని తెలిపారు.